MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక







ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 245 | బుధవారం 25 జూన్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-

# సెప్టెంబర్ 30వ తేదీలోపు ఎన్నికలు నిర్వహించాలి

- సర్పంచ్' ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు
- ఇక, రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను సకాలంలో నిర్వహించడం లేదంటూ దాదాపు ఆరు పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే
- గతేడాది జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసినా.. ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం జాప్యం
- వివిధ పథకాల కింద కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడంలేదు
- వెంటనే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి
- లేకుంటే పాత సర్పంచులకే బాధ్యతలు అప్పగించాలి






**అంకుశం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్:**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల(సర్పంచ్) నిర్వహణపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పును వెల్లడించింది. సెప్టెంబర్ 30వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ మాధవి బెంచ్ తీర్పు ఇచ్చింది. ఈ సందర్భంగా ప్రభుత్వం, ఎన్నికల సంఘం అభ్యర్థనలను సైతం పరిగణలోకి తీసుకున్నట్లు ధర్మాసనం తెలిపింది. అందులో భాగంగానే మూడు నెలల్లో ఎన్నికలను నిర్వహించాలని ఆదేశాల్లో పేర్కొంది. ఇక, రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను సకాలంలో నిర్వహించడం లేదంటూ దాదాపు ఆరు పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. దీనిపై గత కొన్నాళ్లుగా వాదనలు కొనసాగుతున్నాయి. గతేడాది జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసినా.. ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. సర్పంచులను తప్పించి పంచాయతీల బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించింది. ఇది రాజ్యాంగ, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాలకు విరుద్ధం. ప్రత్యేక అధికారులు ఇతర విధుల్లో ఉండటంతో ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులు సమకూరుస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీతో పలువురు సర్పంచులు సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారు. ప్రస్తుతం ఆ నిధులు అందక ఇబ్బందులుపడుతున్నారు. వివిధ పథకాల కింద కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడంలేదు. వెంటనే ఎన్నికల నిర్వహణకు - మిగతా3లో



## ఇక ఏడాదికి రెండుసార్లు పదో తరగతి పరీక్షలు

- సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఏడాది నుంచి రెండుసార్లు పది పరీక్షలు నిర్వహించేందుకు గ్రీన్ సిగ్నల్
- రెండో విడత పదో తరగతి పరీక్షలను ఆప్షనల్‌గా పెట్టింది



## ప్రజాస్వామ్యానికి చీకటియుగం 'ఎమర్జెన్సీ'.. కేంద్ర క్యాబినెట్

- శుభాంశు శుక్లాతో కూడిన మిషన్ విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశించడాన్ని స్వాగతిస్తూ ఆమోదం
- పుణె మెట్రో రైలు విస్తరణకు ఆమోదం



## ఖర్గే చురకలు.. శశిథరూర్ కౌంటర్!

- నాకు ఇంగ్లీష్ చదవడం అంత బాగా రాదు
- కానీ, శశిథరూర్ భాష చాలా బాగుంటుంది.
- భారత సైన్యానికి మద్దతుగా విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చాయి

# ప్రజలు మనపై బాధ్యత పెట్టారు, జాగ్రత్తగా పని చేయాలి

- మచిలీపట్నం అంటే టీడీపీ, టీడీపీ అంటేనే మచిలీపట్నం
- పార్టీ నేతలు కష్టకాలాన్ని మర్చిపోకూడదు
- కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని జూలై 2 నుంచి ఇంటింటికీ తీసుకెళ్లాలి
- ఈ ఏడాది నిరుద్యోగ భృతి అందిస్తాం
- వైసీపీ నేతలు ఇప్పటికీ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారు
- మచిలీపట్నం నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమన్వయ సమావేశంలో మంత్రి లోకేష్



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రజలు మనమైన ఎంతో నమ్మకంతో ప్రజలు మనపై బాధ్యత పెట్టారని, కష్టపడి ప్రజాసమస్యలు పరిష్కరించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మచిలీపట్నం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నేతలతో మంత్రి నారా లోకేష్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మచిలీపట్నం అంటే తెలుగుదేశం పార్టీ, తెలుగుదేశం పార్టీ అంటేనే మచిలీపట్నం. ఇక్కడ ఎప్పుడైతే గెలిచామో అప్పుడే రాష్ట్రవ్యాప్తంగా విజయం సాధించాం. మంత్రి కొల్లు రవీంద్రపై గత ప్రభుత్వంలో ఎన్ని అక్రమ కేసులు పెట్టి వేధించినా టీడీపీ కోసం, చంద్రబాబునాయుడు గారికోసం నిలబడ్డారు. మచిలీపట్నంలో అక్రమ కేసులతో ఎంత వేధించినా పార్టీ పిలుపునిచ్చిన అన్ని కార్యక్రమాల్లో పాల్గొని విజయాన్ని సాధించి పెట్టిన కార్యకర్తలకు నమస్కారాలు. నేను ఈ రోజు మచిలీపట్నం వస్తుంటే అడుగడుగునా పోలీసులు ఉన్నారు. - మిగతా3లో



## 2019 నుంచి ఏపీలో ఎమర్జెన్సీ పాలనే నడిచింది

- గంజాయిపై తమ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది
- హోంమంత్రి వంగలపూడి అనిత
- ఈగల్ టీం ఏర్పాటు చేసి గంజాయి రవాణా, కొనుగోలుని అడ్డుకుంటున్నాం
- పోలీసుల సూచనలు సైతం పెడచెవిన పెట్టి మరీ మనుషుల ప్రాణాలు తీస్తుంటే ఊరుకోవాలా

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. వైసీపీ మూకలు ఇంకోసారి రప్పా రప్పా అంటే ప్రజలు ఎదురు తిరిగి కొడతారని హెచ్చరించారు. జగన్ అతని బ్యాచ్ ఆటలు ఇకపై సాగవని వార్నింగ్ ఇచ్చారు. బుధవారం ఏపీ సచివాలయంలో హోం మంత్రి అనిత - మిగతా3లో

# రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో

- క్యూఆర్ కోడ్‌తో ఇక ఇంటింటికీ బాబు మోసాలు.. ప్రారంభించిన వైఎస్ జగన్
- రాష్ట్రంలో ప్రభుత్వం మారి సంవత్సరం అవుతోంది
- ఇంత తక్కువ వ్యవధిలో ఒక ప్రభుత్వంపై వ్యతిరేకత ఈ స్థాయిలో గతంలో ఏనాడూ లేదు
- అంత తక్కువ కాలంలోనే ఇంత దారుణమైన ప్రజా వ్యతిరేకత కనిపిస్తోంది



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి గుంటూరు**

వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల టైంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు. అమలు చేయకపోవడాన్ని ప్రజల్లో ఎండగడుతూ.. 'రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో'.. 'చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తుకు తెస్తూ..' పేరుతో ఐదువారాల పాటు బృహత్తర కార్యక్రమం జరపాలని ఆయన నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించిన ఆయన.. ఇంటింటికీ దాన్ని చేర్చేలా కార్యక్రమం ప్రారంభించారు. బుధవారం తాడేపల్లిలోని వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారి సంవత్సరం అవుతోంది. ఇంత తక్కువ వ్యవధిలో ఒక - మిగతా3లో

# ప్రజలు మనపై బాధ్యత పెట్టారు, జాగ్రత్తగా పని చేయాలి

-మొదటిపేజీ తరువాయి

మనపై అక్రమ కేసులు పెట్టిన వారే మనకు సెల్యూట్ కొట్టారంటే అదీ ప్రజాస్వామ్య గొప్పదనం. చంద్రబాబు గారి మొండిధైర్యం మామూలుది కాదు. 1996లో రాజమండ్రి సెంట్రల్ జైలును ఆధునీకరించిన వ్యక్తి. 2014-19 మధ్య చంద్రబాబు గారు కట్టిన బ్లాక్ లోనే ఆయనను అక్రమంగా నిర్బంధించారు. జైలు నుంచి చంద్రబాబునాయుడు గారు పులిలా బయటకు వచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు మనకు సెల్యూట్ లు కొడతారు. పార్టీ నేతలు కష్టకాలాన్ని మర్చిపోకూడదు. పార్టీ కోసం కంటిచూపు పోగొట్టుకున్న చెన్నుపాటి గాంధీ, మంజులారెడ్డి, అంజిరెడ్డి తాత, తోట చంద్రయ్యలే మనకు ఆదర్శనం. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలా వ్యవహరించాలి. మన సమస్యల్ని మనమే పరిష్క రించుకుందాం. అంతర్గతంగా పోరాడాలి. జగన్ రెడ్డిపై కంటే మూడు రెట్లు ఎక్కువగా పార్టీలో పోరాడా. పార్టీ ఒక్కసారి నిర్ణయం తీసుకున్న తర్వాత అందరూ కట్టుబడి ఉండాలి.



### ఈ ఏడాది నిరుద్యోగ భృతి అందిస్తాం

దేశంలో ఏ పార్టీకి రానివిధంగా 94శాతం సీట్లు కూటమి కైవసం చేసుకుంది. ప్రజలకు మనం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చెప్పుకోవాలి. మెగా డీఎస్సీ ద్వారా 16వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నాం. పెద్దఎత్తున కంపెనీలను తీసుకువచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. ఈ ఏడాది నిరుద్యోగ భృతి మొదలుపెడుతున్నాం. భూమి కన్నా ఎక్కువ భారం మోసేది మహిళ. వారిని గౌరవించాలనేది టీడీపీ నినాదం. మహిళలను గౌరవించాలనేది ముందు మన ఇంట్లో మొదలవ్వాలి. 50శాతం పనులు మగవారు, 50శాతం పనులు ఆడవారు చేయాలని పాఠ్యాంశాల్లో పెట్టాం. జులై 5న మెగా పేరెంట్స్-టీచర్ మీటింగ్ లో తల్లుల ఆశీర్వాదం తీసుకోవాలి. ఏటా 3 సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం. ఇప్పటి వరకు 2 కోట్ల సిలిండర్లు అందించాం. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి సబ్సీడీ మొత్తాన్ని మహిళల అకౌంట్లలో జమచేస్తాం. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా వృద్ధాప్య పెన్షన్ రూ.4వేలు, దివ్యాంగ పెన్షన్ రూ.6వేలు, పూర్తిగా అంగవైకల్యం ఉన్నవారికి రూ.15వేలు పెన్షన్ అందిస్తున్నాం.

### కూటమి ప్రభుత్వ అభివృద్ధిని జులై 2 నుంచి ఇంటింటికీ తీసుకెళ్లాలి

కూటమి ప్రభుత్వ అభివృద్ధిని గడపగడపకు తీసుకెళ్లాలి. జులై 2 నుంచి సుపరిపాలనలో-తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా డోర్ టూ డోర్ ప్రచారం చేయాలి. పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఇస్తాం. ఇకపై ప్రతి ఒక్కరు నియోజకవర్గ పర్యటనల్లో ముందుగా కార్యకర్తలతో సమావేశం నిర్వహించాలి. కృష్ణా యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన నేను అది చూసుకుని వెళ్లకుండా ముందుగా కార్యకర్తలతో సమావేశం అయ్యాను. ఇకపై నేతలందరూ నియోజకవర్గ పర్యటనల్లో కార్యకర్తలతో భేటీ కావాలి.

### వైసీపీ నేతలు ఇప్పటికీ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారు

వైసీపీ నేతలు ఇప్పటికీ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారు. ప్రతిపక్ష నేత ఇప్పటికీ ప్రజలను కలుసుకోవడం లేదు. కార్యకర్తలను కలవడం లేదు. రెడ్ బుక్ పేరు చెబితేనే ఒకరికి గుండెపోటు వచ్చింది, మరొకరికి బాత్ రూమ్ లో జారి చేయి విరిగింది. మేం చట్టప్రకారం ముందుకు వెళ్తున్నాం. పార్టీ నేతలు, కార్యకర్తలకు అహంకారం వద్దు. సౌమ్యంగా ఉండాలి. అందరికీ అందుబాటులో ఉండాలి. ప్రజలు మనపై బాధ్యత పెట్టారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేయాలి. కష్టపడి ప్రజల సమస్యలను పరిష్కరించాలి.

### ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోంది

ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోంది. కేంద్ర సహకారం వల్లే మనం ముందుకు వెళ్లగలుగుతున్నాం. ఏపీ అన్ని కోరికలను ప్రధాని నరేంద్ర మోదీ గారు తీరుస్తున్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖలో 3 లక్షల మంది యోగసనాలతో గిన్నీస్ బుక్ రికార్డ్ సృష్టించి మోదీ గారికి కానుకగా ఇచ్చాం. కూటమి పార్టీలు కలిసికట్టుగా పనిచేస్తాయి. కూటని బలోపేతం చేద్దాం. ప్రభుత్వం, పార్టీ జోడెద్దుల బండి. రెండింటినీ నడిపేందుకు కష్టపడి పనిచేస్తున్నామన్నారు. మాటల్లో కాకుండా చేతల్లో కార్యకర్తలను గౌరవిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్రతో పాటు మచిలీపట్నం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, జిల్లా ఇంఛార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, జోనల్ ఇంఛార్జ్ మంతెన సత్యనారాయణ రాజు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, నియోజకవర్గ పరిశీలకులు ఎల్. సాయిరాం ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 'రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో'..

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వంపై వ్యతిరేకత ఈ స్థాయిలో గతంలో ఏనాడూ లేదు. అంత తక్కువ కాలంలోనే ఇంత దారుణమైన ప్రజా వ్యతిరేకత కనిపిస్తోందని అన్నారాయన. చంద్రబాబునాయుడు.. ఈ వ్యతిరేకత మధ్య, ప్రజలకు మంచి చేయాల్సింది పోయి, ప్రజలను తప్పు దోవ పట్టించాలని చూస్తున్నారు. అందుకే ఈరోజు రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్‌తో పాటు, అణిచివేత చూస్తున్నాం. రెడ్‌బుక్ పాలన చూస్తున్నాం. గత వైయస్సార్‌సీపీ ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం మధ్య స్పష్టంగా తేడా కనిపిస్తోంది. మన 5 ఏళ్ల పాలనలో వివక్ష లేకుండా పథకాలు అందించాం. పార్టీ చూడకుండా మంచి చేశాం. అదే ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వంలో కనిపిస్తోంది ఏమిటంటే, కేవలం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ, విచ్చలవిడిగా అన్యాయాలు కనిపిస్తున్నాయి.



### అన్ని వ్యవస్థలు విధ్వంసం

మన ప్రభుత్వంలో ఎప్పుడూ చూడని విధంగా విద్య, వైద్యం, వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులతో పాటు, పాలనలో పూర్తి పారదర్శకత చూపాం. దిశ యాప్ ద్వారా మహిళలకు రక్షణ కల్పించాం. ఇలా ఎన్నో మార్పులు చూశాం. కానీ చంద్రబాబు ఈ ఏడాది పాలనలో మోసం, దగా తప్ప ఏమీ లేదు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నిలబెట్టుకోలేదు. ఈ ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తవుతుంది.

### రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో.. ఉద్దేశమిదే

ఏడాది పాలనలో చంద్రబాబు వల్ల ప్రతి కుటుంబానికి జరిగిన నష్టం ఎంత? ఈ ఏడాది కూడా పథకాలు లేవు కాబట్టి, ఇంకా ఎంత నష్టం జరుగుతోంది. మరోవైపు మన ప్రభుత్వం ఉండి ఉంటే, ఎంతెంత ప్రయోజనాలు అనేది చెప్పాలి. చంద్రబాబు మోసాలపై ప్రజలను చైతన్యం చేయాలి. చంద్రబాబు తానిచ్చిన హామీల రిబ్బన్ కూడా కట్ చేయకుండా, అన్నీ అమలు చేశామని చెబుతున్నాడు. ఎవరైనా ప్రశ్నిస్తే, నాలుక మందం అంటున్నాడు. ఈరోజు ఇక్కడ ఒక కార్యక్రమం ప్రారంభం. చంద్రబాబు మ్యానిఫెస్టోలో ఏం చెప్పాడు? ఇప్పుడు ఎలా మోసం చేస్తున్నాడు? అన్నింటిపై గ్రామ గ్రామాన, తీసుకుపోయేదే ఈ కార్యక్రమం. దీని పేరు.. 'రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో' అదే తెలుగులో.. 'చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తుకు తెస్తూ..'

### చంద్రబాబు హామీలు. బాండ్లు

ఎన్నికల ముందు చంద్రబాబు ఏమన్నాడు? జగన్ చేస్తున్నవే కాకుండా. అంతకు మించి ఇస్తానన్నాడు. జగన్‌కన్నా ఎక్కువ చేస్తానన్నాడు. %-% ఆ మాటలు చెప్పడమే కాకుండా, ప్రతి ఇంటికి తన నాయకులు, కార్యకర్తలను పంపించి.. ఆ కుటుంబం వద్దనే వారు కూర్చుని, మిస్డ్ కాల్ ఇప్పించారు. దాంతో ఓటీపీ వచ్చింది. దాన్ని ఎంటర్ చేయగానే, ఆ కుటుంబంలో ఎవరెవరికి ఏ పథకం వర్తిస్తుంది. దాని వల్ల ఎంతెంత వస్తుంది? అన్న వివరాలతో బాండ్ వస్తుంది.

చంద్రబాబు మోసాలను క్యూఆర్ కోడ్ రూపంలో ఇంటింటికీ చేర్చాలి

దానిపై ఏమని ఉంటుంది అంటే..

చంద్రబాబునాయుడు అనే నేను, మన రాష్ట్ర ప్రజలు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, త్రికరణ శుద్ధిగా ప్రతిజ్ఞ చేస్తున్నాను. అంటూ ఆయన, పవన్‌కళ్యాణ్ ఇద్దరూ సంతకం చేశారు. ఇంకా ఏయే పథకాల ద్వారా ఆ ఇంటికి ఎంతెంత వస్తుంది.. అంటూ పథకాలు వివరించారు. తల్లికి వందనం కింద ఇంత, అన్నదాతా సుఖీభవ, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి.. ఈ పథకాల కింద మీరు అర్హులయ్యారు. మీకు 2024 జూన్ నుంచే ఆ మొత్తం అందుతుంది.

### ప్రలోభాలు. పచ్చి మోసం

ఏపీ ప్రజలకు ఇలా బాండ్లు ఇచ్చి, ప్రలోభాలు పెట్టి, చంద్రబాబు అండ్ కో పచ్చి మోసం చేశారు. అవన్నీ ఇప్పుడు ప్రజల్లో ప్రస్తావిస్తున్నాం. అందుకే ప్రజలంతా డిమాండ్ చేయాలి. మాకు జూన్ 2024 నుంచి ఇస్తామన్నావు. కానీ ఇవ్వలేదు. మాకు ఇంత బాకీ ఉన్నావు. మరి ఈ ఏడాది ఎప్పుడిస్తున్నావు? అంటూ ప్రజలు చంద్రబాబును నిలదీయాలి. అడగాలి.

### ఇవన్నీ ఎగ్గొట్టారు

ఒకవైపు అన్ని పథకాలు ఎగ్గొట్టిన చంద్రబాబు, మరోవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. ప్రతి త్రైమాసికానికి ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్. ఆరు త్రైమాసికాలు పెండింగ్. అలా రూ.700 కోట్ల చొప్పున మొత్తం రూ.4200 కోట్లు. కానీ ఇచ్చింది కేవలం రూ.750 కోట్లు. మరోవైపు వసతి దీవెన కింద ఏటా రూ.1100 చొప్పున రెండేళ్లకు రూ.2,200 కోట్లు. పెండింగ్. ఆరోగ్యశ్రీ. నెలకు రూ.300 కోట్లు. అలా ఏడాదికి రూ.3,600 కోట్లు బకాయిలు. దీంతో నిరుపేదలకు పథకంలో వైద్య సేవలు అందడం లేదు. ఆరోగ్య ఆసరా లేనే లేదు. చేయూత, ఆసరా.. ఇలా ఏ పథకం లేదు. వ్యవసాయం తిరోగమనం. ఎక్కడా పంటలకు కనీస గిట్టుబాటు ధర లేదు. ఆర్బీకేలు నిర్వీర్యం అయిపోయాయి. ఉచిత పంటల బీమా లేదు. ఇన్‌పుట్ సబ్సిడీ లేనే లేదు.

### ఐదు వారాల కార్యక్రమం

వీటన్నింటి మధ్య.. మనం రీకాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో కార్యక్రమం మొదలు పెడుతున్నాం. ఈ కార్యక్రమాన్ని 5 వారాలు చేద్దాం. తొలుత పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లు. పార్టీ జిల్లా అధ్యక్షులు పాల్గొంటారు. వీళ్లు క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తారు. ఆ తర్వాత రెండు బటన్లు నొక్కితే, చంద్రబాబు మ్యానిఫెస్టో, బాండ్లు వస్తాయి. మరో బటన్ నొక్కితే, ఒక్కో కుటుంబం ఎంతెంత నష్టపోయిందో వస్తుంది. ఆ వివరాలను తెలియజేయాల్సి ఉంటుంది. రెండో దశలో నియోజకవర్గ స్థాయిలో, మూడో దశలో మండల స్థాయిలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ. ఆ స్థాయి నాయకుల ప్రెస్‌కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. నాలుగో దశలో గ్రామస్థాయిలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలి. అందరికీ అర్థమయ్యేలా వివరించాలి. ఇందులో గ్రామ కమిటీలను ఇన్‌వాల్వ్ చేయాలి. ఈ ప్రక్రియ కొనసాగుతున్నప్పుడే ఎక్కడైనా మండల, గ్రామ కమిటీల ఏర్పాటు పూర్తి కాకపోతే.. దాన్నీ పూర్తి చేయాలి. 5 వారాల ఈ కార్యక్రమం జరిగే నాటికి గ్రామస్థాయిలో కూడా అన్ని కమిటీల ఏర్పాటు పూర్తి కావాలి. చంద్రబాబు పచ్చి మోసాలు ప్రజలకు వివరించడమే మన ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే.. ప్రజాగళం. సూపర్‌సిక్స్, సూపర్ సెవెన్ హామీలు వస్తాయి. అంతే కాకుండా చంద్రబాబు చేసిన దగా, పచ్చి మోసం వివరాలు కూడా వస్తాయి. గత ఏడాది ఇవ్వకుండా ఎగ్గొట్టింది ఎంత? ఇక ఈ ఏడాది రావాల్సిన మొత్తం ఎంత? అనేది కూడా తెలుస్తుంది. అన్ని పథకాల ద్వారా ఆ ఇంటికి (పథకాల వారీగా) నెలకు ఎంతెంత చొప్పున, ఏడాదికి ఎంత వస్తుంది?. అలా 5 ఏళ్లలో ఆ ఇంటికి మొత్తం ఎంత నగదు అందుతుంది.. అని చెబుతూ సంతకాలు చేసి మరీ ప్రతి ఇంటికి బాండ్ పంపారు. కానీ ఒక్క రూపాయి కూడా అందలేదు. ఆ బాండ్ల మీద చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఫోటోలతో పాటు, వాటిపై పార్టీ నాయకుల సంతకాలు పెట్టి, ఇంటింటా పంచారు. అవన్నీ రెడీగా పెట్టుకొండి. మీ ఇంటికి టీడీపీ నాయకులు రాగానే నిలదీయాలి. గత ఏడాది నుంచి ఇంత బాకీ. ఈ ఏడాది ఇంకా ఎంత రావాలి అనేది తెలియజేయాలి. ఇవే కాకుండా, చంద్రబాబు గత ఎన్నికల్లో ఏం చెప్పారు? పథకాల వారీగా వివరిస్తూ.. వాస్తవానికి ఇప్పుడు ఏం చేస్తున్నారు?. తల్లికి వందనం మొదలు ఉచిత బస్సు వరకు అన్నీ నేను మాట్లాడిన మాటలు.. పక్కనే చంద్రబాబునాయుడివి నాటి మాటలు చూపుతూ.. సూటిగా ప్రశ్నించేలా ఈ కార్యక్రమం ఉంటుంది.

### ప్రజలతో మమేకం కావాలి

ఏడాది గడిచింది. హనీమూన్ పీరియడ్ ముగిసింది. ఇక నుంచి యుద్ధం చేయాల్సిందే. కాబట్టి అందరినీ కలుపుకుపోవాలి. ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఇది ఎమ్మెల్యే అభ్యర్థులకు చాలా కీలకం. ప్రజా సమస్యలు తెలుసుకోవాలి. వారికి అందుబాటులో ఉండాలి. ప్రజల సమస్యలపై పోరాడాలి. అప్పుడే మనం సత్తా చూపగలం.

### ఇది రాక్షస రాజ్యం. అందుకే..

ప్రజా సమస్యలపై మనం పోరాడాలి. వారితో మమేకం కావాలి. ఎందుకంటే ఇది రాక్షస రాజ్యం. ప్రజలకు సమస్యలు పరిష్కారం కావడం లేదు. కలెక్టర్ల దగ్గరకు పోయినా, ప్రయోజనం ఉండడం లేదు. కాబట్టి, మనం ప్రతి చోటా, ప్రతి క్షణం ప్రజలతో మమేకం కావాలి. వారి సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలి. కృషి చేయాలి. చివరగా.. ఈనెల 4న 'వెన్నుపోటు దినం' బాగా చేశారు. మీ అందరికీ నా అభినందనలు. మొన్నటి యువతపోరు చాలా చోట్ల బాగా జరిగింది. వారందరికీ కూడా నా అభినందనలు అని వైఎస్ జగన్ కేడర్‌ను ఉద్దేశించి అన్నారు. ఈ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులు, జిల్లా పార్టీ అధ్యక్షులతో పాటు, పార్టీ రీజినల్ కో%-%ఆర్డినేటర్లు హాజరయ్యారు.

## ఆ రెండు అరాచకాలు దేశ ప్రజలకు కేస్ స్టడీస్

-మొదటిపేజీ తరువాయి

దిశగా వేసిన తొలిదుగుకు ప్రధాని మోదీ సహకరించారని చంద్రబాబు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు అంబేద్కర్ అందించిన పదునైన ఆయుధం ఓటు హక్కు అని తెలిపిన చంద్రబాబు, మంచి రోజులతో పాటు చీకటి రోజుల్నీ గుర్తుపెట్టుకుంటేనే మంచి-చెడును బేరీజు వేయగలమన్నారు. మంచి చెడుల వ్యత్యాసంపై ప్రజల్ని చైతన్య పరిచేందుకు సంవిధాన్ హత్య దివాస్ కార్యక్రమానికి మోదీ శ్రీకారం చుట్టారని చెప్పారు. దేశ చరిత్రలో అతిపెద్ద చీకటి రోజు జూన్ 25 ఎమర్జెన్సీ విధించిన రోజు అని చెప్పిన బాబు, నాడు ఎమర్జెన్సీతో ప్రజాస్వామ్య హక్కుల్ని కాలరాశారన్నారు. రాజ్యాంగ మూలలను మర్చిపోకుండా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. నాడు ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని ఇందిరాగాంధీ కూలదోస్తే, తిరిగి గద్దెనెక్కటం ప్రజాస్వామ్య విజయం అని చంద్రబాబు స్పష్టం చేశారు.

## 2019 నుంచి ఏపీలో ఎమర్జెన్సీ పాలనే నడిచింది

-మొదటిపేజీ తరువాయి

మీడియాతో మాట్లాడారు. జగన్ పల్నాడు జిల్లా పర్యటనతో ముగ్గురు ప్రాణాలను తీశారని ఫైర్ అయ్యారు. అంబులెన్స్ సైరన్ వినిపిస్తే చిన్న పిల్లలు కూడా పక్కకు తప్పుకుంటారని.. కానీ జగన్ తన కాన్వాయ్‌ని రోడ్డు మీదనే ఉంచడంతో అన్యాయంగా ఓ యువకుడు ప్రాణం కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ప్రచార పిచ్చితో మధు అనే యువకుడి ప్రాణం పోయిందని అన్నారు. ఆ రోజు అంబులెన్స్‌కు దారి ఇచ్చి ఉంటే మధు బతికేవారని తెలిపారు హెూం మంత్రి అనిత.

### ప్రాణాలు తీస్తుంటే ఊరుకోవాలా..

పోలీసుల సూచనలు సైతం పెడచెవిన పెట్టి మరీ మనుషుల ప్రాణాలు తీస్తుంటే ఊరుకోవాలా అని హెూం మంత్రి అనిత ప్రశ్నించారు. మైండ్ గేమ్‌లతో వైసీపీ మూకలు చేస్తున్న కుట్రలపై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు. జగన్ తాలూకా సైకో నైజాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. విధ్వంసం, విద్వేషానికి బ్రా%శీ%డ్ అంబాసిడర్ జగన్ అని ఆరోపించారు. ఎక్కడ ఎవరూ చనిపోతారా అని ఎదురు చూస్తున్న ఆయన స్వభావం అందరికీ అర్థమవుతోందని చెప్పుకొచ్చారు హెూం మంత్రి అనిత.

### విధ్వంసాలను రెచ్చగొడుతున్నారు...

ఎమర్జెన్సీ విధించిన రోజునే జగన్ ప్రజావేదిక కూల్చారని హెూం మంత్రి అనిత మండిపడ్డారు. విధ్వంసాలను మళ్లీ రెచ్చగొట్టేందుకు జగన్ సిద్ధమవుతున్నారని ధ్వజమెత్తారు. 2019 నుంచి రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలనే నడిచిందని ఆక్షేపించారు. ఇప్పుడు నీతులు చెబుతున్న జగన్‌కు గత ఐదేళ్ల విధ్వంసాన్ని అతనికే గుర్తు చేయాలని అన్నారు. నోటి పారుదల శాఖ నుంచి అంబటి రాంబాబు ఇంకా బయటకు రానట్లున్నారని హెూంమంత్రి వంగలపూడి అనిత ఎద్దేవా చేశారు.

### గంజాయిపై ఉక్కుపాదం..

అంతకుముందు... సీఎం చంద్రబాబు గుంటూరు పర్యటన ఏర్పాట్లను హెూం మంత్రి అనిత, ఎమ్మెల్యేలు నసీర్, మాధవి పరిశీలించారు. ఇన్నర్ రింగ్ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్‌లో హెలీప్యాడ్ వద్ద ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు హెూం మంత్రి అనిత. గంజాయిపై తమ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని అన్నారు. ఈగల్ టీం ఏర్పాటు చేసి గంజాయి రవాణా, కొనుగోలుని అడ్డుకుంటున్నామని తెలిపారు. గుంటూరులో రెండు రోజుల పాటు సీఎం చంద్రబాబు పర్యటిస్తారని చెప్పారు హెూం మంత్రి అనిత. ఈ సందర్భంగా 26, 27వ తేదీల్లో గుంటూరులో సీఎం చంద్రబాబు పర్యటిస్తారని హెూం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. 26వ తేదీన యాంటీ నార్కోటిక్ డే కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని వెల్లడించారు. శ్రీ కన్వెన్షన్‌లో యువత, విద్యార్థులతో మాదక ద్రవ్యాల వినియోగంపై జరిగే నష్టాల గురించి సమావేశం జరుగుతుందని తెలిపారు. గురువారం ఫీవర్ ఆస్పత్రి నుంచి చిల్లీస్ సెంటర్ వరకు యాంటీ నార్కోటిక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని హెూం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.

## కూటమి కాన్ఫిడెన్స్ లెక్కంటో...

**విజయవాడ :** ఏపీ పాలిటిక్స్‌లో మళ్లీ జగన్ వర్సెస్ పవన్ ఎపిసోడ్ ఇంట్రెస్టింగ్‌గా మారుతోంది. ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు వరకు ఆ ఇద్దరి మధ్య నెక్స్ట్ లెవల్‌లో మాటల యుద్ధం కొనసాగింది. ఇక ఏడాదిగా చూస్తే జగన్, పవన్ మధ్య అప్పుడప్పుడు డైలాగ్ వార్ నడుస్తున్నా ఇష్యూ బేస్డ్‌గా మాట్లాడి అక్కడితో వదిలేస్తున్నారు. ఇప్పుడు మరోసారి జగన్, వైసీపీపై పవన్ కౌంటర్లు వేస్తుండటంతో రాజకీయ వేడి రాజుకుంటోంది.జగన్ రెంటపాళ్ల పర్యటనలో ప్లకార్డులు, ఆ తర్వాత ఆయన కామెంట్స్‌తో పొలిటికల్ హీట్ పెరిగింది. వైసీపీ, జగన్ టార్గెట్‌గా పవన్ స్ట్రాంగ్ వార్నింగే ఇచ్చారు. తొక్కి నార తీస్తామని, మక్కెలు విరగగొట్టి కూర్చోబెడతామంటున్నారు పవన్. అసాంఘిక శక్తులను ఏరివేస్తామన్నారు. రోడ్లెక్కి పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే అసలు ఊరుకోమంటున్నారు. గొంతు కోస్తామని అంటే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. సరదాగా ఇక్కడ ఎవరూ కూర్చోలేదంటున్న పవన్..అధికారంలో ఉన్నపుడు అరాచకాలు సృష్టించారని ఇపుడు కూడా అలాగే చేద్దామనుకుంటే లైట్ తీసుకునే ముచ్చటే లేదంటున్నారు.అంతే కాదు కూటమి ఐక్యతకు తాను ప్రాధాన్యత ఇస్తాననని 20 ఏళ్లు కూటమే అధికారంలో కొనసాగుతుందని క్లారిటీగా చెబుతున్నారు పవన్. మళ్లీ జగన్ ప్రభుత్వం రానే రాదు..తాను మాట ఇస్తున్నానంటున్నారు పవన్. కనీసం పదిహేనేళ్లు కూటమి పవర్‌లో ఉంటుందని భరోసా ఇస్తున్నారు.అటు సీఎం చంద్రబాబు మాట తీరులోనూ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజలకు వాస్తవాలు చెప్పాలనే ఆలోచన బాబు ప్రసంగాల్లో స్పష్టమవుతోంది. అన్నీ చేసేశామని చెప్పటం లేదు కానీ..ఊహించిన దానికంటే ఎక్కువగా..చెప్పనివి కూడా చేశామని మాత్రం చెప్పగలను అంటున్నారు చంద్రబాబు. కూటమి అధికారంలోకి వచ్చాక ఎక్కడ ప్రయాణం మొదలైందో..ఏడాదిలో ఏం సాధించామో ప్రజలే విశ్లేషించుకోవాలని కోరుతున్నారు.అయితే అటు చంద్రబాబు, ఇటు పవన్ మాటల్లో అయితే వైసీపీ మళ్లీ అధికారంలోకి రాదనే భావన స్పష్టంగా కనిపిస్తోంది. దీని వెనుక మర్మమేంటన్న దానిపై మాత్రం పెద్దఎత్తున డిస్కషన్ జరుగుతోంది. ఇప్పటికే సూపర్ సిక్స్ స్కీమ్‌లలో చాలావరకు అమలు చేశారు. ఇంకా ఒకటో, రెండో స్కీమ్‌లు పెండింగ్‌లో ఉంటే..వాటిని ఎప్పటి నుంచి ఇంప్లిమెంట్ చేస్తామో షెడ్యూల్ కూడా ప్రకటించేశారు.ఇక రోడ్లు బాగు చేశారు. ఎమ్మెల్యేల పనితీరుపై ఎప్పటికప్పుడు ఫోకస్ పెడుతున్నారు. పైగా వైసీపీ వ్యవహరిస్తున్న తీరు తమకు ప్లస్ పాయింట్ గా మారుతుందని భావిస్తున్నారట కూటమి పెద్దలు. అపోజిషన్‌లో ఉన్నప్పటికీ అరాచకాలు, అడ్డగోలు మాటలు.. మాట్లాడుతున్నారని..వైసీపీని ప్రజలు ఓడించిందే అందుకని..రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటమి తప్పదని అంచనా వేస్తున్నారట కూటమి లీడర్లు.ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న స్కీమ్‌లు..ఇప్పటికీ ప్రజల్లో వైసీపీపై వ్యతిరేకత ఉందన్న నమ్మకం..కూటమి ఐక్యతే తమను తిరిగి మళ్లీ మళ్లీ నిలబెడుతుందని నమ్ముతున్నారట కూటమి అగ్రనేతలు. మొన్నటి ఎన్నికలకు ఇప్పటికి కూటమికి మైలేజ్ పెరిగిందని..చంద్రబాబు పాలనపై ప్రజలకు నమ్మకం ఉందని భరోసాగా ఉన్నారట. అందుకే వైసీపీ మళ్లీ రానే రాదన్న గట్టి నమ్మకంతో ఉన్నారట పవన్. పైగా మళ్లీ కూటమిగా వెళ్తామని చెప్పడం ద్వారా పబ్లిక్ మూడ్‌ను మరింతగా తమవైపునకు తిప్పుకునే స్కెచ్ వేస్తున్నారని అంటున్నారు.అయితే పవన్ మాటలను లైట్ తీసుకోలేమని అంటున్నారు పొలిటికల్ ఎనలిస్టులు. సేమ్‌టైమ్ పవన్ అంత నమ్మకంతో చెప్తున్నారంటే కూటమి దగ్గర ఫ్యూచర్ ప్లాన్స్ ఉండే ఉంటాయంటున్నారు.

## కాడెద్దులకు మారిన గిరిజనులు

**విశాఖపట్టణం :** రైతులు పొలం పనులు చేయాలంటే దుక్కి దున్నాలి. దుక్కి దున్నాలంటే ఎద్దులతో పని. కానీ తమ ఎద్దులు, ఆవులను బెంగాల్ టైగర్ చంపడంతో, పరిహారం అందకపోవడంతో రైతు కుటుంబాలే కాడెద్దులుగా మారి దుక్కి దున్నుతూ నిరసన తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం రొంపిల్లి పంచాయతీ పరిధిలో ఈ సీన్ కనిపించింది. అన్నదాతల కష్టాలు చూసిన వారు ప్రభుత్వం వారికి అండగా నిలవాలని, వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.అల్లూరి జిల్లా అనంతగిరి మండలం రొంపిల్లి పంచాయతీ బూరిగ. చిన్నకోనిల గ్రామాల్లో గిరిజన ఆదివాసి రైతులు సోముల పైడమ్మ, సోముల చిన్న గంగమ్మ, కోటపర్తి గంగులు, కరాసి లచ్చమ్మ, బూరిగ గౌరమ్మ లి/0 ధర్మయ్యలకు చెందిన 3 ఆవులు, 4 ఎద్దులు 2023 జనవరి మొదటి వారంలో అడవిలో మేతకు వెళ్లాయి. ఆ సమయంలో బెంగాల్ టైగర్ దాడి చేసి వారి ఆవులు, ఎద్దులను చంపింది.

# వివాహేతర సంబంధానికి అడ్డు ఉండకూడదని హత్య





**జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టిసారింపుతో 6 గంటల వ్యవధిలోనే హత్య కేసు ఛేదింపు**

**ఇద్దరి అరెస్టు... హత్యకు ప్రియుడిని ఉసిగొల్పిన భార్య**

**ఇందులో స్వయాన భార్య, ఆమె ప్రియుడే నిందితులు... ఆటో, తదితరాలు సీజ్**

**జిల్లా ఎస్పీ పి.జగదీష్ గారి ఆదేశాలతో వివరాలు వెల్లడించిన అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు**

**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం జూన్ 25 :** అనంతపురం నగరంలో ఇటీవల హత్యకు గురైన కేసుని అనంతపురం పోలీసులు ఆరు గంటల్లో చేదించారు జిల్లా ఎస్పీ పి జగదీష్ ఉదయం సీరియస్ కావడంతో సాయంత్రానికల్లా నిందితులను అనంతపురం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు అనంతపురం రూరల్ లో వివాహేతర సంబంధానికి అడ్డు ఉండకూడదని ఉద్దేశంతోనే స్వయంగా భార్యని భర్తని చంపించిందని అనంతపురం జిల్లా రూరల్ డిఎస్పి వెంకటేశులు తెలిపారు హత్యకు సంబంధించిన వివరాలను రూరల్ డిఎస్పి విలేకరుల సమావేశంలో ఏ విధంగా జరిగింది అన్ని విషయాలు వివరించారు

**నిందితుల వివరాలు:** బాబా ఫకృద్దీన)
కుమ్మర నరసాపురం అనిత, వయస్సు 37 స.లు,

**హతుడి వివరాలు :**
కుమ్మర నరసాపురం సురేష్ బాబు,

**హత్య ... నేపథ్యం :**

ఈరోజు అనంతపురం మండలం అక్కంపల్లి-రాచానపల్లి మధ్యలో కుమ్మర నరసాపురం సురేష్ బాబు హత్యకు గురయ్యాడు. దీనిపై అనంతపురం రూరల్ పోలీసు స్టేషన్లో కేసు Cr.No.150/2025 U/s 103 (1) BNS నమోదైంది.

కుమ్మర నరసాపురం సురేష్ బాబు స్థానిక కళ్యాణదుర్గం రోడ్ లో హొటల్ పెట్టుకొని జీవనము సాగిస్తున్నాడు. ఇతని భార్య అనిత స్థానిక మొదటి రోడ్ లో ఉన్న ఓ హొటల్ లో పని చేస్తోంది. ఈమెకు 2 నెలల కిందట బాబా ఫకృద్ధీన్ తో పరిచయము ఏర్పడింది. ఇతను 10 సంవత్సరాల కిందట ...స్వగ్రామమైన గొరదిండ్ల నుండీ స్థానిక సదాశివ కాలనీకి కుటుంబం సహా మకాం మార్చాడు. పండ్లు బండిలో వేసుకుని ఊరూరు తిరుగుతూ వ్యాపారం చేసుకుంటున్నాడు.

**జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టి... వెంటనే ఛేదించాలని ఆదేశాలు**

అక్కంపల్లి సమీపంలో హత్య జరిగిందనే విషయం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ పి.జగదీష్ సీరియస్ అయ్యారు. వెంటనే ఛేదించాలని ఆదేశించారు. అంతేకాకుండా... ఎస్పీ గారే స్వయాన పర్యవేక్షించి కేసు ఛేదింపునకు కృషి చేశారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు పర్యవేక్షణలో సి.ఐ శేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఇద్దరు నిందితులను పక్కా రాబడిన సమాచారంతో కేవలం ఆరు గంటల్లో అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ గారు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు పర్యవేక్షణలో హత్య కేసు ఛేదించిన సి.ఐ శేఖర్ బృందాన్ని అభినందించారు.

## నందలూరు, తాళ్లపాక

# బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

## – టిటిడి జేఈవో . వి. వీరబ్రహ్మం

**అంకుశం న్యూస్ తిరుపతి జూన్ 25:** టిటిడి అనుబంధనంగా ఉన్న అన్నమయ్య జిల్లా నందలూరు, తాళ్లపాకలోని ఆలయాలలో జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం ఆదేశించారు. అధికారులతో కలిసి ఆయన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను నందలూరు, తాళ్లపాకలలో పరిశీలించారు. అన్నమయ్య జిల్లా నందలూరులో శ్రీ సౌమ్యనాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జూలై 05 నుండి 13వ తేదీ వరకు, తాళ్లపాకలోని శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ సిద్ధేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు జూలై 06 నుండి 15వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయన్నారు. ఈ సందర్భగా నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు జూలై 04వ తేదీన, తాళ్లపాకలోని శ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీ సిద్దేశ్వర స్వామి వారి ఆలయాల బ్రహ్మోత్సవాలకు జూలై 05న అంకురార్పణ జరుగనుందన్నారు.

నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు జూలై 05న ఉదయం 10.30 నుండి 11.00 గంటల వరకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు వాహనసేవలు జరుగుతాయి. తాళ్లపాకలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో జూలై 06న ఉదయం 9 నుండి 10 గంటల మధ్య సింహ లగ్నంలో, శ్రీ సిద్ధేశ్వర స్వామి వారి ఆలయంలో జూలై 06న ఉదయం 6.16 గం.లకు





ధ్వజారోహణంతో బ్రహ్మో త్సవాలు ప్రారంభమవుతాయి.

**బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు – జేఈవో**

నందలూరు, తాళ్లపాక ఆలయాల వార్షిక బ్రహ్మోత్సవాలకు భక్తుల సౌకర్యార్థం విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టినట్లు టిటిడి జేఈవో వెల్లడించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. వాహన సేవలలో సమయ పాలన పాటించాలని కోరారు. ఆలయ పరిసరాలలో ప్రతి రోజూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు దర్శనం, తాగునీరు, ప్రసాదాలు పంపిణీలో ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నందలూరు, తాళ్లపాకలలో ఆకట్టుకునేలా విద్యుత్ , పుష్ప అలంకరణలు చేపట్టాలన్నారు. ఈ మూడు ఆలయాల్లో కళ్యాణోత్సవాలకు విచ్చేసే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వాహన సేవలో భక్తులను ఆకట్టుకునేలా కళాబృందాలను ఏర్పాటు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఆదేశించారు. టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతి రోజూ హరికథలు, ఆధ్యాత్మిక, భక్తి, సంగీత కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎస్.ఈలు వేంకటేశ్వర్లు, మనోహరం, డిప్యూటీ ఈవోలు నటేష్ బాబు, శ్రీ శివప్రసాద్, శ్రీమతి ప్రశాంతి, డిఎఫ్వో ఫణికుమార్ నాయుడు, పట్టణీకరణ నిపుణులు శ్రీ రాముడు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా ముత్యాలమ్మ


# వారి జాతర,తీర్థ మహోత్సవాలు






**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 25:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణ దేవత శ్రీ ముత్యాలమ్మ వారి జాతర తీర్థం వైభవంగా నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే తల్లిగా పేరుగాంచిన శ్రీ ముత్యాలమ్మ వారి ఆలయంలో తొగరు మూర్తి కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించి అమ్మవారి గరగలను ఎత్తి సంబరం మొదలు పెట్టించారు. విద్యార్థినీ విద్యార్థులకు పండితులతో సరస్వతి దేవి పూజలు నిర్వహించి పెన్నులు, పుస్తకములు పంపిణీ చేశారు.అనంతరం తీన్మార్ డప్పులతో,గరగల నృత్యాలతో, చిన్నారుల సంప్రదాయ కోలాటాలతో, బాణాసంచాలతో వైభవంగా ఊరేగింపు నిర్వహించి ప్రతీ గడపకు అమ్మవారి ఆశీర్వాదం అందించారు .వైయస్సార్ నగర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, పట్టణ ప్రధాన రహదారులలో ఊరేగింపు నిర్వహించి రాజగోపాల్ సెంటర్లో ముత్యాలమ్మ వారి ఆలయ గౌరవాధ్యక్షుడు తొగరుమూర్తి ఇంటికి చేరుకుని వారి కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. ఊరేగింపులో పాల్గొన్న భక్తులకు ప్రజలకు శీతల పానీయాలను అందించారు. అమ్మవారి తీర్థం సందర్భంగా మధ్యాహ్నం 11 గంటల నుంచి అన్నదానం కార్యక్రమాన్ని తొగరు మూర్తి ఆధ్వర్యంలో ప్రారంభించారు. రామచంద్రపురం పట్టణ ప్రజలు పరిసర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ముత్యాలమ్మ వారి ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా తొగరు మూర్తి మాట్లాడుతూ 2007వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు ప్రతీ సంవత్సరం ముత్యాలమ్మ తీర్థం సందర్భంగా భక్తులకు అన్నదానం చేస్తున్నానని, అలాగే రామచంద్రపురం పట్టణ పరిసర ప్రాంత విద్యార్థిని విద్యార్థులు వారి లక్ష్యసాధనలో ఉన్నత శిఖరాలు సాధించాలనే ఉద్దేశంతో వారిచే సరస్వతి దేవి పూజలు నిర్వహించి పుస్తకములు,పెన్నులు అందజేస్తున్నానని తెలిపారు.ఈ కార్యక్రమంలో యానాదుల సంఘం అధ్యక్షులు మద్రి గణపతి, కార్యదర్శి రెడ్డి కృష్ణ, మద్దెల అశోక్, కొమరగిరి వెంకటరమణ,గొర్రెల నరసింహమూర్తి ఒలిలిశెట్టి బాబి,తొగరు సుబ్బారావు, తొగరు బ్రహ్మాజీ, దుర్గాప్రసాద్ అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## గైట్ కళాశాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నల్లమిల్లి చేతులు మీదుగా దేశపోరాట యోధులకు సన్మానం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 25:** దేశం కోసం వీరోచిత పోరాటం తో ఎమర్జెన్సీ సమయంలో జైలు జీవితం గడిపిన ప్రతి ఒక్కరూ సమాజానికి ఆదర్శ ప్రాయులని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఎమర్జెన్సీ సమయంలో అరెస్టులు అయి జైలు జీవితం గడిపిన వారికి రాజమహేంద్రవరం గైట్ కళాశాల నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా అప్పట్లో అరెస్ట్ అయి 11 నెలలు జైలు జీవితం గడిపిన మండపేట కు చెందిన బీజేపీ నేత వల్లూరి విజయానంద పార్థ సారధి తో పాటు మరి కొందరిని కళాశాల ప్రాంగణంలో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 1975 నాటి ఎమర్జెన్సీ సంగతులను కళ్ళకు కట్టినట్లు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎస్.ఎస్ ప్రచారం ఓలేటి సత్యనారాయణ, తూర్పు గోదావరి జిల్లా బీజేపీ అధ్యక్షులు పీక్కి నాగేంద్ర, గైట్ కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లికి వందనం టీడీపీ ప్రభుత్వం విజయం!



**అంకుశం న్యూస్ ధర్మవరం జూన్ 25:** రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలుగు దేశం ప్రభుత్వం ద్వారా అమలు చేసిన తల్లికి వందనం పథకం విజయవంతం అయిందని ధర్మవరం నియోజకవర్గం టీడీపీ నాయకులు సందా రాఘవ పేర్కొన్నారు. బిడ్డల చదువుల కోసం తల్లులు ఆనంద పడేవిధం గా తల్లికి వందనం అందరికీ ఆనందం కలిగించిందని అన్నారు.అన్నమాట నిలబెట్టుకున్న ఘనత చంద్రబాబు నాయుడు దే నన్నారు.

## అంబేడ్కర్ భవనం నిర్మించాలి.. సాకే హరి




**అంకుశం న్యూస్ కళ్యాణ్ దుర్గం జూన్ 25:** అనంతపురం జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో అభివృద్ధి సంక్షేమం కోసం పట్టణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనం నిర్మించాలని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కోరారు.బుధవారం కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంత కుమార్ ను జేఏసీ ఆధ్వర్యంలో కలిసి అంబేద్కర్ భవనం నిర్మించాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం సాకే హరి మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలు కాలంగా ఎస్సీ నియోజకవర్గంగా కొనసాగినప్పటికీ అంబేద్కర్ భవనం గురించి ఎవరు ఆలోచించకపోవడం చాలా బాధాకరమన్నారు .కుల,ప్రజా సంఘాల పోరాట ఫలితంగా 95 సెంట్లు అంబేద్కర్ భవనానికి కేటాయిస్తే కొంత స్థలం అక్రమణాలకు గురి కావడం జరిగిందన్నారు. అధికారులు కబ్జాదారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంబేద్కర్ భవనం నిర్మాణం కోసం ఇప్పటికే రెండు కోట్లు నిధులు విడుదలైతే నిర్లక్ష్యం కారణంగా నిధులు వెనక్కి వెళ్లిపోవడం దురదృష్టకరమన్నారు.ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి,అవసరాలను దృష్టిలో ఉంచుకొని కేటాయించిన స్థలంలో అంబేద్కర్ భవనాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గ కేంద్రంలోనూ అంబేద్కర్ భవనాలు నిర్మాణాల కోసం విస్తృతస్థాయిలో ఉద్యమాలు చేస్తామన్నారు. నియోజకవర్గ అధ్యక్షులు చెలిమప్ప,మాల మహానాడు జిల్లా అధ్యక్షులు సుగామంచి శ్రీనివాసులు. దళిత సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఐదకల్లు రామాంజీ నేయులు, సమత సైనిక్ దళ్ ఈశ్వర ప్రసాద్,జేఏసీ నాయకులు రామకృష్ణ, నారాయణస్వామి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్ పై ప్రధాని పొగడ్తలు.. టీడీపీలో భయం

**విజయవాడ :** ఏపీలోతెలుగుదేశం పార్టీ కంటే సీనియర్ భారతీయ జనతా పార్టీ. తెలుగుదేశం పార్టీ ఎంట్రీ సమయంలోనే విశాఖ నగరపాలక సంస్థను బిజెపి గెలుచుకుంది. కాంగ్రెస్ పార్టీని ఢీ కొట్టాలంటే బిజెపి అవసరమని గుర్తించారు నందమూరి తారక రామారావు. అప్పటినుంచి ఇప్పటివరకు బిజెపితో అప్పుడప్పుడు తప్ప మైత్రి కొనసాగుతూనే ఉంది. అయితే ఏపీలో టిడిపి బలమైన శక్తిగా ఎదిగింది. కానీ బిజెపి పరిస్థితి మాత్రం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంది. దీనికి కారణం చంద్రబాబు చతురత. చంద్రబాబు ఉన్నంతవరకు బిజెపి ఎంట్రీ అంత ఆషామాషీ కాదు. అదే బిజెపి పూర్తిస్థాయిలో ఎంట్రీ ఇస్తే టిడిపి మనుగడ కష్టం. అందుకే చంద్రబాబు చేతికి టీడీపీ పగ్గాలు వచ్చిన తర్వాత ఆయన ఒక వ్యూహాత్మకంగా వ్యవహరించారు. బిజెపిని నిలువరించారు. అయితే ఇప్పటికిప్పుడు కాకపోయినా.. ఏపీలో మాత్రం బిజెపి బలపడేందుకు తప్పకుండా ప్రయత్నం చేస్తుంది. అది కూడా లోకేష్ ద్వారా వర్కౌట్ చేయాలన్నది ప్లాన్ గా తెలుస్తోంది.గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రధాని మోదీ నారా లోకేష్ కు ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రత్యేకంగా సమావేశాల్లో లోకేష్ ప్రస్తావన తీసుకొస్తున్నారు. పొగడ్తలతో ముంచేత్తుతున్నారు. ఢిల్లీకి ప్రత్యేకంగా ఆహ్వానించి చర్చలు జరుపుతున్నారు. మొన్నటికి మొన్న యోగాంధ్రా వేడుకల్లో లోకేష్ ను ఆశీర్వదించారు. అయితే గతంలో చాలా రాజకీయ పార్టీలు, నేతల విషయంలో ప్రధాని మోదీ ఇలానే వ్యవహరించారు. చాలా చనువు తీసుకున్నారు. అటు తరువాత వారి పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. బిజెపి నుంచి వారికి రాజకీయ ఇబ్బందులు ఎదురయ్యాయి. మహారాష్ట్రలో శివసేన ఠాక్రె ఫ్యామిలీకి, ఉత్తరప్రదేశ్లో బీఎస్పీ మాయావతి, కర్ణాటకలో జేడిఎస్ దేవే గౌడ, తమిళనాడులో అన్న డిఎంకె, ఒడిస్సాలో నవీన్ పట్నాయక్, బీహార్లో నితీష్ కుమార్ వంటి వారిని ఇలానే దగ్గర తీసుకొని దెబ్బేశారు. ఇప్పుడు కూడా లోకేష్ విషయంలో అటువంటి పరిస్థితి ఉంటుందన్న టాక్ ప్రారంభం అయింది.చంద్రబాబు ఉన్నంతవరకు నో డౌట్. ఆయన విషయంలో బిజెపి క్రాష్ చేసే అవకాశం లేదు. ఆ చాన్స్ కూడా ఆయన ఇవ్వరు. ఎందుకంటే చంద్రబాబు గురించి బిజెపికి తెలుసు. అందుకే భవిష్యత్తు అవసరాల దృష్ట్యా లోకేష్ తో సఖ్యతగా ఉన్నారు బిజెపి పెద్దలు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఒక వరం

: ఎంపి కేశినేని శివనాథ్

30 మంది లబ్ధి దారులకు రూ.24 లక్షల 28 వేల రూపాయాల చెక్కుల అందజేత

**అంకుశం ప్రతినిధి విజయవాడ జూన్ 25 :** రాష్ట్రంలోని పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం లాంటిది. అనారోగ్యం బారిన పడి వైద్య చికిత్సలు చేయించుకున్న బాధితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో తక్షణం అందిస్తున్న సీఎంఆర్ఎఫ్(సీఎం రిలీ ఫ్ ఫండ్) చేయూతగా నిలుస్తుందని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. గురునానక్ కాలనీ లోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో బుధవారం సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.24 లక్షల 28 వేల రూపాయాల విలువ గల చెక్కులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పంపిన లేఖను లబ్ధిదారులకు ఎంపి కేశినేని శివనాథ్ అందజేయటంతో పాటు లబ్ధిదారులందరితో ఎంపీ కేశినేని శివనాథ్ ప్రత్యేకంగా మాట్లాడారు. వేలు, సి.హెచ్. రామారావు రూ.40 వేలు, కె.సత్యవతి రూ.40,786 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సుపరిపాలనలో రాష్ట్రంలో ప్రజలందరూ సంతోషంగా వున్నారన్నారు. లబ్ధిదారులకు సకాలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందే విధంగా చర్యలు తీసుకున్న సీఎం చంద్రబాబుకి ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్.వో.సి పత్రాలు అందుతున్నాయన్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాదిలో 145 మందికి దాదాపు కోటి 85 లక్షల రూపాయల చెక్కులు అందజేయటం జరిగందన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఎన్డీయే కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.



ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ , టిడిపి నాయకులు సంకె విశ్వనాథం లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కేశినేని శివనాథ్ తో బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ భేటీ



**అంకుశం ప్రతినిది, విజయవాడ జూన్ 25:** విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తో ఆంధ్రప్రదేశ్ బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గా వ్యవహరిస్తున్న బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ బుధవారం మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ కి విచ్చేసిన గారెత్ విన్ ఓవెన్ ను ఎంపీ కేశినేని శివనాథ్ శాలువతో సత్కరించి కొండపల్లి బొమ్మను బహుకరించారు. ఈ సందర్భంగా కొండపల్లి బొమ్మల ప్రత్యేకతను గారెత్ విన్ ఓవెన్ కు వివరించారు. అనంతరం వీరిద్దరూ వర్తమాన సామాజిక రాజకీయ, విద్య,ఉపాధి వంటి అంశాలపై మాట్లాడుకోవటంతో పాటు సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో పెట్టుబడుల అంశంపై కూడా చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ రాజకీయ ఆర్థిక అంశాల సలహాదారు నళిని రఘురామన్, అకాడమిక్ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ సిఈవో అన్నే సుధీర్, డైరెక్టర్ అన్నే లక్ష్మీ తులసీ పాల్గొన్నారు.

# షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగల వారికి లక్ష్యం మేరకు చర్యలు తీసుకోవాలి

- : ప్రభుత్వం నుండి అందే సహాయ సహకారాలను పూర్తిస్థాయిలో అందేలా చూడాలి

- : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,

**అంకుశం న్యూస్ అనంతపురం, జూన్ 25 :** షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగల వారికి లక్ష్యం మేరకు లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సాంఘిక / గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల కాంపోనెంట్ మానిటరింగ్ కమిటీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ నిర్వహించారు.

- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పథకంలో 17.08 శాతం ఎస్సీలకు, 5.53 శాతం ఎస్టీలకు వ్యయానికి సంబంధించిన శాతం ఖర్చు చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలకు అందించాల్సిన పథకాల లబ్ధి పూర్తిగా అందించాలని, ఇందులో ఎప్పటికప్పుడు పురోగతి ఉండాలన్నారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగల వారికి ప్రభుత్వం నుండి అందే సహాయ సహకారాలను పూర్తిస్థాయిలో అందేలా చూడాలని ఆదేశించారు. ఆయా శాఖల పరిధిలో గత ఆర్థిక సంవత్సరంలో ఎంత లక్ష్యం ఇచ్చారు, ఈ ఏడాది కూడా అదే



లక్ష్యాన్ని నిర్దేశించాలని, దానిని సాధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సాయిల్ హెల్త్ కార్డులను ఎస్సీ లబ్ధిదారులకు లక్ష్యం మేరకు ఇవ్వాలని, స్త్రీ నిధి కింద మహిళలకు రుణాలు అందజేయాలన్నారు. ధర్తి ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద అన్ని పథకాలను అమలు చేసి దేశస్థాయిలో జిల్లా మొదటి స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పిఎంఈజిపి రుణాలకు సంబంధించి యూనియన్ బ్యాంక్ పరిధిలో సక్రమంగా మంజూరు చేయడం లేదని పలు ఫిర్యాదులు వస్తున్నాయని, దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రుణాలు మంజూరయ్యేలా జీఎం డిఐసి మానిటర్ చేయాలన్నారు. జిల్లాకు కేటాయించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్ లను పూర్తి స్థాయిలో వచ్చేలా చూసి లబ్ధిదారులకు అందించాలన్నారు. ఆయా శాఖల పరిధిలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కేటాయించిన లక్ష్యం మేరకు పూర్తిస్థాయిలో లబ్ధి చేకూర్చాలని ఆదేశించారు.



- ఈ సమావేశంలో డిటిడబ్ల్యూఓ రామాంజనేయులు, జడ్పి సిఈఓ శివశంకర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, డిసిఓ అరుణకుమారి, ఐసిడిఎస్ పిడి నాగమణి, సిపిఓ అశోక్ కుమార్, హౌసింగ్ పిడి శైలజ, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస యాదవ్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, మెప్మా పిడి విశ్వజ్యోతి, పశుసంవర్ధక శాఖ జెడి వెంకటస్వామి, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, ఏపీఎంఐపి పీడీ రఘునాథరెడ్డి, డిసిహెచ్ఎస్ డా.పాల్ రవికుమార్, ఐసిడిఎస్ పిడీ నాగమణి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, ఆర్.అండ్.బి ఎస్ఈ రాజగోపాల్, డిపిఓ నాగరాజు నాయుడు, డివిఈవో వెంకటరమణ నాయక్, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, ఆయా శాఖల శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అనంత హత్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలి

ప్రత్యేక బృందాలను ఏర్పాటు

జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు హత్యలపై జిల్లా ఎస్పీ పి.జగదీష్ సీరియస్

**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం జూన్ 25** :అనంతపురం జిల్లా అనంతపురం నగరంలో ఇటీవల జరిగిన హత్యలు పై అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ సీరియస్గా స్పందించారు దౌర్జన్యాలకు హత్యలకు పాల్పడుతున్న వారిని వెంటనే అరెస్టు చేయాలని అందుకు సంబంధించి ప్రత్యేక టీములను ఏర్పాటు చేయడం జరిగిందని అనంతపురం జిల్లా ఎస్పీ పి జగదీష్ అన్నారు. ఈ రెండు హత్య కేసులను ఛేదించేందుకు రంగంలోకి ప్రత్యేక పోలీసు బృందాలు దించామని ఎస్పీ జగదీష్ తెలిపారు. వెంటనే ఛేదించాలని ఎస్పీ ఆదేశాలు జారీ... అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు.లి అనంతపురంలోని బళ్లారి బైపాస్ లో గార్లదిన్నె మండలం కోటంకకు చెందిన చిదానంద నిన్న హత్యకు గురికాగా... ఈరోజు రాచానపల్లి వద్ద సురేష్ హత్యకు గురి కావడాన్ని జిల్లా ఎస్పీ పి.జగదీష్ సిరియస్ గా తీసుకున్నారు. ఈ హత్యలకు కారణాలు ఏవైనా వెంటనే ఛేదించాలని ఎస్పీ గారు అనంతపురం నాల్గవ పట్టణ మరియు రూరల్ పోలీసులను ఆదేశించారు. అనంతపురం అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. సంబంధిత సి.ఐ ల ఆధ్వర్యంలో ఈ బృందాలు గాలిస్తున్నాయి. అనుమానితులను గుర్తించి విచారిస్తున్నారు. ఈ రెండు వేర్వేరు హత్యా ఘటనలను వెంటనే ఛేదించాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఏమాత్రం అలసత్వం వహించినా చర్యలు తప్పవని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ పి జగదీష్ హెచ్చరించారు.



## ప్రతి ఒక్కరూ తపాలా సేవలు సద్వినియోగం చేసుకోండి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 25:** భారతీయ తపాలా శాఖ ఇండియా పోస్ట్ చెల్లింపుల బ్యాంకు (ఐ.పి.పి.బి) ద్వారా గ్రూప్ ఆక్సిడెంటల్ పాలసీ కేవలం సంవత్సరానికి 520 రూపాయల ప్రీమియంతో పది లక్షల రూపాయల బీమా పాలసీని ప్రజలకు అందజేస్తోంది. అందులో భాగంగా టెంట్ హౌస్ లో పనిచేసే కార్మికులకు సదరు సంస్థ అనపర్తి శ్రీ వీరుళ్ళమ్మ లైటింగ్ డెకరేషన్ వారు, వారే స్వయంగా కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా ఏక్సిడెంటల్ బీమా పాలసీ ప్రీమియం చెల్లించారు. ఈ బీమా పాలసీ చేయించుకున్న తరువాత శ్రీ సత్తి వీర రాఘవ రెడ్డి పనిలో ఉండగా గోడ మీద నుండి జారి క్రింద పడి దురదృష్టవశాత్తూ మరణించినందున వారి నామినీ అయిన భార్య శ్రీమతి సత్తిదేవి కి పది లక్షల రూపాయల చెక్కును అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్, రాజమండ్రి పడమర సబ్ డివిజన్ శ్రీ ఎ. నారాయణ చేతులమీదుగా అందచేసారు.అనపర్తి మండలం పొలమూరు లో శ్రీ వీరుళ్ళమ్మ లైటింగ్ డెకరేషన్ టెంట్ హౌస్ సౌండ్ సిస్టమ్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యములో రాష్ట్ర స్థాయిలో జరిగిన రెండవ వార్షికోత్సవ కార్యక్రమానికి, అసోసియేషన్ కార్య వర్గం, ఇతర ప్రత్యేక అతిథులుగా రాజమండ్రి అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్, రాజమండ్రి పడమర సబ్ డివిజన్ శ్రీ ఎ. నారాయణ, రాజమండ్రి ఐ.పి.పి.బి. బ్రాంచ్ హెడ్ శ్రీ రాజేంద్ర నాయుడు, అనపర్తి సబ్ పోస్ట్ మాస్టర్ శ్రీ కంభం సుమంత్ తదితరులు హాజరు అయ్యారు. ఎవరైనా ఈ ప్రమాద బీమా పాలసీ తీసుకోదలచినచో దగ్గరలో ఉన్న పోస్టాఫీస్ ను సంప్రదించి ఈ బీమా పాలసీ ని తీసుకోవడం ద్వారా వారి ప్రియమైన వ్యక్తులు దురదృష్టవశాత్తూ దూరం అయిన సమయాన కూడా వారి కుటుంబానికి ఈ పాలసీ ఆర్థికపరమైన భరోసా ఇవ్వగలదని తెలిపారు. సభలో వక్తలు తపాలా శాఖ ద్వారా లభించే విలువైన ఈ ప్రమాద బీమా సదరు కార్మికుని కుటుంబానికి అనుకోని ఈ ఆకస్మిక విపత్తు లో ఆర్థికంగా చేయూత నిచ్చి, సకాలములో బీమా సొమ్ము అందిందని కొనియాడారు.

# సింగయ్య మరణం ముమ్మాటికి జగన్ చేసిన హత్యే

ఒక దళితున్ని బలి తీసుకొని మళ్లీ బుకాయిస్తున్నాడు

అనంత శాసనసభ్యుడు దగ్గుపాటి ప్రసాద్

**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 25:** పల్నాడు జిల్లాలో జరిగిన సింగయ్య మరణం ముమ్మాటికి జగన్ చేసిన హత్యేనని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. సింగయ్య మృతి విషయంలో వైసీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యల మీద ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉనికి కోసం బల ప్రదర్శనలు చేస్తూ రాష్ట్రంలో సొంత పార్టీ కార్యకర్తలను కూడా జగన్ బలి తీసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం అనుమతులు లేవని ముందే చెప్పినప్పటికీ వినకుండా ఏదో ఒక అలజడి సృష్టించాలన్న ఉద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. పల్నాడు జిల్లాలో జగన్ కు కేవలం మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చారని కానీ ఆయన ఇతర ప్రాంతాల నుంచి కార్యకర్తలను తీసుకొచ్చి ఒక బల ప్రదర్శనకు దిగారన్నారు. అనుమతులు లేకుండా వేలమందితో ర్యాలీ చేశారని దాని ఫలితంగానే జగన్ వాహనం కింద సింగయ్య పడ్డారన్నారు. తాను చేసిన తప్పు ఒప్పుకోకుండా ప్రభుత్వంతో పాటు పోలీసుల మీద బురద జల్లుతున్నారన్నారు. 679 మంది పోలీసులను జగన్ పర్యటనలో బందోబస్తుకు పెట్టారన్నారు. బెట్టింగులు కట్టి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి విగ్రహావిష్కరణకు జగన్ వెళ్లారంటే జగన్ ను ఏమనాలో తెలియడం లేదన్నారు.





ఆయనకు ఎక్కడ శవం కనిపిస్తే అక్కడ వాలిపోతారని దాన్ని రాజకీయం చేసేందుకు ఎన్నో కుట్రలు పన్నుతారని దగ్గుపాటి విమర్శలు చేశారు. జగన్ హయాంలో దళితులు చనిపోతే కనీసం పట్టించుకోలేదని ఇప్పుడు సింగయ్య లాంటి దళిత సోదరుడు మరణిస్తే దానికి నైతిక బాధ్యత వహించకుండా బుకాయిస్తున్నాడన్నారు. గతంలో పవన్ కళ్యాణ్, నారా లోకేష్ పర్యటనలను ఏ విధంగా అడ్డుకున్నారో ప్రజలంతా చూశారన్నారు. సింగయ్య మృతిని జాతీయ ఎస్సీ కమిషన్ సీరియస్గా తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## సచివాలయ ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ కల్పించండి.. సచివాలయ ఉద్యోగులు నల్ల బ్యాడ్జితో నిరసన.



**అంకుశం న్యూస్ ధర్మవరం జూన్ 25:** సచివాలయ ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ కల్పించాలని, ఉద్యోగుల సమస్యలపై తక్షణమే కమిటీ వేయాలని కోరుతూ సచివాలయ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీధర్, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, ఇంజనీర్ విభాగం అసిస్టెంట్ నాయకులు రాజకుమార్, డిజిటల్ అసిస్టెంట్ నాయకులు తుకారాం మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులందరికీ పదోన్నతి కల్పించాలని, 9 నెలల పెండింగ్ అరియర్స్ తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. పదోన్నతులు ఇచ్చిన తర్వాతనే బదిలీ ప్రక్రియ చేపట్టాలని వారు తెలిపారు. సచివాలయ శాఖకు చట్టబద్ధత కల్పించాలని, పెండింగ్ నేషనల్ ఇంక్రిమెంట్లు వెంటనే ఇవ్వాలని, రేషనేలైజేషన్ కి ముందే ఉద్యోగాలకు క్లారిటీ ఇవ్వాలని, జాబ్ చాట్ వెంటనే ప్రకటించాలని తెలిపారు. అనంతరం ఎంపీడీవో సాయి మనోహర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. సచివాలయ ఉద్యోగులుగా తాము నల్ల బ్యాడ్జితో ర్యాలీ నిర్వహించి మానవహారంలో మా సమస్యలను తెలపడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రేగాటిపల్లి సురేష్ రెడ్డి.

**అంకుశం న్యూస్ ధర్మవరం జూన్ 25:** మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన వైఎస్ఆర్సిపి పంచాయితీ రాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేగాటిపల్లి సురేష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ధర్మవరం నియోజకవర్గంలోని పలు సమస్యలపై అధినేతకు విన్నవించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి బలోపేతానికి కృషి చేయాలని తనకు జగన్మోహన్ రెడ్డి తెలపడం జరిగిందని తెలిపారు.



## చేనేత కార్మికునికి ఆర్థికంగా చేయూత.. శంకర్ బ్రదర్స్, చింతా కుమార్.

**అంకుశం న్యూస్ ధర్మవరం జూన్ 25:** పట్టణంలోని మూడవ వార్డ్ శాంతినగర్ లో గల విమర్శ ఆంజనేయులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జరిగింది. దీంతో ఆ కుటుంబానికి ఎంతో కొంత ఆర్థిక సహాయం చేయాలన్న తపనతో శంకర్ బ్రదర్స్ - వారు 20 వేల రూపాయలు, చింత కుమార్ వారు 5000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని ఆ కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం దాతలు మాట్లాడుతూ ఈ కుటుంబాన్ని ప్రభుత్వము, దాతలు అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

